సాక్షి
కాకినాడ
శనివారం । 4 । మార్చి । 2023



కమనీయం.. నరసన్న కల్యాణం

కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం కమనీయంగా సాగింది. రాత్రి 9 గంటలకు వైఖానస ఆగమం ప్రకారం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. - IIలో▸



మండుటెండలో పరుగుల పరీక్ష

ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా రన్నింగ్‌లో పాల్గొన్న 10వ తరగతి విద్యార్థినులు ఎండధాటికి తాళలేక సొమ్మసిల్లి పడిపోయి, తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. - IIలో▸

డెల్టాలకు 7,540 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 7,540 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,170, మధ్య డెల్టాకు 1,600, పశ్చిమ డెల్టాకు 3,770 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.05 అడుగులకు చేరింది.

అడ్డగోలు దోపిడీకి బ్రేక్

- కోవిడ్ ఖర్చుల్లో 'స్వచ్ఛంద' సేవలకూ బిల్లులు
- బట్టబయలైన బాగోతం
- బెడిసికొట్టిన అక్రమార్కుల వ్యూహం
- పక్కన పెట్టిన బిల్లులు రూ.17 కోట్లు పైనే..
- తీవ్రంగా పరిగణించిన కాకినాడ కలెక్టర్
- ఇప్పటికే డీఎంహెచ్ఓ సరెండర్
- ఇద్దరు ఉద్యోగుల బదిలీ

కోవిడ్ బిల్లులతో పాత బిల్లులు కూడా కలిపేశారు. స్వచ్ఛంద సంస్థల సేవలను కూడా తమ ఖాతాల్లో వేసేసుకుని ప్రజాధనాన్ని అడ్డంగా నొక్కేద్దామనుకున్నారు. జిల్లాల పునర్విభజన జరిగినప్పటికీ కోవిడ్‌కు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్రం కాకినాడ నుంచే నిర్వహిస్తున్నారు. దీంతో అడ్డగోలు దోపిడీ యత్నాన్ని కాకినాడ జిల్లా కలెక్టర్ నకాలంలో పసిగట్టారు. ఫలితంగా అక్రమార్కుల వ్యూహం అడ్డంగా బెడిసి కొట్టింది. విషయాన్ని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ సంబంధిత అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలకు ఉపక్రమించారు.



కాకినాడ జీజీహెచ్‌లో కోవిడ్ బాధితుడి వివరాలు తెలుసుకుంటున్న నాటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ మురళీధర్‌రెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కోవిడ్ మొదటి, రెండు వేవ్‌లతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అతలాకుతలమైంది. కరోనా మహమ్మారి నుంచి ప్రజలను రక్షించుకునేందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసింది. రోగులకు అవసరమైన అన్ని రకాల సేవలనూ ఎటువంటి లోటూ లేకుండా ప్రభుత్వం అందించింది. కాకినాడ జేఎన్‌టీయూ, అమలాపురం శివారు బోడసకుర్రు టిడ్కో గృహ సముదాయాలు, రాజమహేంద్రవరం బొమ్మూరు ప్రాంతాల్లో కోవిడ్ కేర్ సెంటర్లు (సీసీసీ) ఏర్పాటు చేశారు. వీటితో పాటు కాకినాడ జీజీహెచ్, రాజమహేంద్రవరం వైద్య విధాన పరిషత్ ఆస్పత్రి, అమలాపురం, రామచంద్రపురం ప్రాంతీయ ఆస్పత్రుల్లో కూడా కోవిడ్ సేవలందించారు. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య ఉపకరణాలు, మాస్కులు, మందులు, శానిటైజర్లు, సీసీసీల్లో రోగులకు అల్పాహారం, భోజనాల వంటి వాటిని ఎక్కడికక్కడ రెవెన్యూ, వైద్య, ఆరోగ్య శాఖల ఆధ్వర్యాన క్షేత్ర స్థాయిలో ముందస్తుగా కొనుగోలు చేసి సమకూర్చారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా సీసీసీలు, ఆస్పత్రుల్లో కోవిడ్ బాధితులకు భోజనాలు, అల్పాహారం అందించి, మానవత్వం చాటుకున్నాయి.

పారని పన్నాగం

కరోనా మహమ్మారి తగ్గుముఖం పట్టిన తరువాత కోవిడ్ సమయంలో చేసిన ఖర్చులంటూ వైద్య, ఆరోగ్యం సహా పలు శాఖల నుంచి రూ.లక్షల్లో బిల్లులు తయారు చేశారు. వీటిలో స్వచ్ఛంద సంస్థలు సమకూర్చిన వస్తువులు, భోజనాలు, సేవలను కూడా అక్రమార్కులు తమ ఖాతాలో వేసేసుకున్నారు. వాటిని కూడా తమ ఖర్చులుగానే చూపించేందుకు బరితెగించారు. సంబంధిత బిల్లులు కూడా సిద్ధం చేశారు. ఆ విధంగా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తే ఆ డబ్బులు నొక్కేయాలని వ్యూహం పన్నారు. అయితే వారి పన్నాగం పారలేదు. 'తీగ లాగితే డొంక కదిలిన' చందంగా ఈ తప్పుడు బిల్లుల బాగోతం బట్టబయలైంది. కోవిడ్‌కు ముందు వైద్య, ఆరోగ్య శాఖలో జరిపిన ఇతర లావాదేవీలను కూడా కోవిడ్ బిల్లుల్లోనే కలిపి చూపించినట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల నుంచి ఈ విధంగా వచ్చిన మొత్తం కోవిడ్ బిల్లులు రూ.17 కోట్లు పైనే ఉన్నట్టు అధికార వర్గాలు ధ్రువీకరించాయి. పెద్ద మొత్తంలో బిల్లులు, అవి కూడా పాతవి రావడంతో కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు అనుమానం వచ్చింది. దీంతో నాలుగు శాఖల ద్వారా వచ్చిన ఆ ఫైళ్లను ఆమె పక్కన పెట్టారు. ఈ ఫైళ్లను సక్రమంగా నిర్వహించలేదని ప్రాథమిక పరిశీలనలో గుర్తించారు. దీంతో వాటి నిజానిజాలు నిగ్గు తేల్చాలని నిర్ణయించారు. అయితే నాడు కోవిడ్ సమయంలో పని చేసిన అధికారులెవరూ ప్రస్తుతం జిల్లాలో లేరు. నాటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ మురళీధర్‌రెడ్డి, సీసీసీలను పర్యవేక్షించిన అదనపు జాయింట్ కలెక్టర్, అప్పటి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) తదితరులు ప్రస్తుతం వివిధ హోదాల్లో ఇతర జిల్లాల్లో, రాష్ట్ర స్థాయిలో పని చేస్తున్నారు.

స్టేట్ ఆడిట్ బృందం విచారణ

ఈ నేపథ్యంలో కలెక్టర్ కృతికా శుక్లా తొలుత మొత్తం అన్ని బిల్లులనూ తిప్పి పంపేశారు. బిల్లుల నిర్వహణలో ఉద్దేశపూర్వకంగా తప్పులు చేసినట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చి, కాకినాడ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతిప్రభను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. కలెక్టరేట్ హెచ్–సెక్షన్ సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్లను బదిలీ చేశారు. వారు విచారణను ప్రభావితం చేస్తారనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. బిల్లుల్లో లొసుగులను నిగ్గు తేల్చేందుకు రాష్ట్ర స్థాయి ఆడిట్ బృందంతో విచారణ చేపట్టారు. కోవిడ్ సమయంలో పని చేసిన అధికారులెవరూ ప్రస్తుతం ఇక్కడ లేకపోవడంతో అంతా గందరగోళంగా ఉంది. ఆడిట్ అధికారులే నిజాలు నిగ్గు తేల్చాల్సి ఉంది.

బిల్లుల నిర్వహణలో లోపాలు



బిల్లుల నిర్వహణలో అన్ని స్థాయిల్లోనూ లోపాలున్న మాట వాస్తవమే. మా పరిశీలనలో ఈ విషయం స్పష్టమైంది. ఇందుకు బాధ్యులైన వారిపై ప్రాథమిక సమాచారం మేరకు చర్యలు తీసుకున్నాం. సమగ్ర విచారణకు ఆదేశించాం. స్టేట్ ఆడిటర్ల బృందంతో బిల్లుల్లో లొసుగులను వెలికి తీయిస్తున్నాం. ఏయే శాఖల నుంచి ఏయే బిల్లులు వచ్చాయి, వాటి వాస్తవ పరిస్థితి ఏమిటనేది ఆడిటర్లు ఆరా తీస్తున్నారు. ఈ ప్రక్రియ కొలిక్కి రావడానికి వారం పది రోజులు పడుతుంది. బిల్లులు ఏ స్థాయిలోనూ అప్‌లోడ్ చేయకపోవడంతో ఒక్క పైసా కూడా పక్కదోవ పట్టలేదు.

– కృతికా శుక్లా, కలెక్టర్, కాకినాడ జిల్లా

న్యూస్‌రీల్

ఏలేరు నుంచి 1,185 క్యూసెక్కుల విడుదల



స్పిల్‌వే ద్వారా విడుదలవుతున్న ఏలేరు జలాలు

ఏలేశ్వరం: ఏలేరు జలాశయం నుంచి 1,185 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఆయకట్టుకు 600, స్పిల్‌వే ద్వారా 250, విశాఖకు 225, పంపా రిజర్వాయర్‌కు 60, తిమ్మరాజు చెరువుకు 50 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. ఏలేరు రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 86.56 మీటర్లు కాగా, శుక్రవారం 80.36 మీటర్లుగా నమోదైంది. జలాశయం నీటినిల్వ సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా 13.87 టీఎంసీల మేర నిల్వలు ఉన్నాయి.

6న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: తమ కార్యాలయంలో ఈ నెల 6వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బజాజ్ క్యాపిటల్ కంపెనీలో టెలికాలర్, ఫైనాన్షియల్ అడ్వయిజర్, డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ, నాట్కో ఫార్మాలో ప్యాకింగ్, హౌస్‌కీపింగ్, ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్‌లో కస్టమర్ సపోర్ట్ అసోసియేట్, ఇసుజు మోటార్స్‌లో టెక్నీషియన్, ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో లోడర్, డ్రైవర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని వివరించారు. అలాగే డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కింద శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ఈ ఉద్యోగాలకు టెన్త్ నుంచి పీజీ వరకూ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాలను బట్టి వీరికి నెలకు రూ.10 వేల నుంచి రూ.18 వేల వరకూ జీతం, ఇన్సెంటివ్‌లు, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఉంటాయని వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయానికి సోమవారం ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరు కావాలని లచ్చారావు సూచించారు.

జిల్లా స్థాయి కథల పోటీలకు ఆహ్వానం

కాకినాడ సిటీ: విద్యార్థులకు జిల్లా స్థాయి కథల పోటీ నిర్వహిస్తున్నామని జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జేవీవీ ఆధ్వర్యాన పిల్లల కథలు–2023 పుస్తకాన్ని ప్రచురించనున్నామని, ఇందుకోసం ఈ పోటీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు పోటీలో పాల్గొనవచ్చన్నారు. ఆనందం, అహ్లాదం కలిగించేవి, సైన్స్, మానవ సంబంధాలు, నీతి, ఆరోగ్యకరమైన హాస్య కథలకు ప్రాధాన్యముంటుందని వివరించారు. పుస్తక దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 23న జరిగే జిల్లా స్థాయి సభలో పిల్లల కథలు–2023 పుస్తకాన్ని ఆవిష్కరిస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయి ఉత్తమ కథలుగా ఎంపికైన రచయితలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. పుస్తకానికి ఎంపికైన రచనలకూ బహుమతులు ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ కథలను జేవీవీ మండల, జిల్లా స్థాయి నాయకులకు ఈ నెల 15వ తేదీ లోగా అందజేయాలని సూచించారు. వివరాలకు 90000 60987 నంబరులో తనను, 91777 98999 నంబరులో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీరామారావును, 99631 63136 నంబరులో జిల్లా కన్వీనర్ ఎ.గోపాలకృష్ణ (కృష్ణశ్రీ)ని సంప్రదించవచ్చని ప్రసాద్ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

గోకవరం: మండలంలోని రామన్నపాలెం గ్రామ శివారున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటాపురం గ్రామానికి చెందిన పండా వెంకన్నదొర (50) రామన్నపాలెం వైపు శుక్రవారం రాత్రి నడిచి వెళ్తుండగా రంపచోడవరం వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. గోకవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, బావాజీపేట శివారున జరిగిన మరో ప్రమాదంలో ఇంకో వ్యక్తి మృతి చెందాడు. గోకవరం ఎస్సై శ్రీనివాసరావు కథనం ప్రకారం.. డాక్టర్ మండపేటకు చెందిన లేగా దుర్గాప్రసాద్ (34) ముత్తూట్ ఫైనాన్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. వివాహమై, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మొదటి భార్య చనిపోవడంతో గోకవరానికి చెందిన మహిళను దుర్గాప్రసాద్ వివాహం చేసుకున్నాడు. ఆమెను చూసేందుకు గురువారం రాత్రి వస్తుండగా బావాజీపేట శివారున హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న మట్టిదిబ్బలపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. 108లో గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించేసరికే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పక్కా హద్దులు ఏర్పాటు చేయాలి



గండేపల్లిలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జేసీ ఇలక్కియ

గండేపల్లి: జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో చేస్తున్న భూముల రీ సర్వే అనంతరం ఆయా కొలతలకు అనుగుణంగా పక్కా హద్దులు ఏర్పాటు చేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ఆదేశించారు. మండలంలో భూముల రీ సర్వే చేసిన యర్రపాలెంలో శుక్రవారం ఆమె పర్యటించారు. సర్వే రికార్డులు, అడంగల్, పన్ను రశీదులు, 1బి పుస్తకాలను పరిశీలించారు. హద్దుల ఏర్పాటులో అలసత్వం వహిస్తే ఉపేక్షించబోమని సిబ్బందిని హెచ్చరించారు. లోపాలకు తావు లేకుండా సర్వే చేయాలన్నారు. తొలుత గండేపల్లిలోని రేషన్ దుకాణం–5లో ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) ద్వారా లబ్ధిదారులకు సరకులు అందజేస్తున్న తీరును పరిశీలించారు. ఎండీయూల నిర్వాహకులు కార్డుదారుల ఇళ్ల వద్దకే వెళ్లి సరకులు అందించాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ చిన్నారావు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎన్.ప్రదీప్‌కుమార్, వీఆర్‌ఓలు కృష్ణ, షేక్ బాబా ఉన్నారు.

9 నుంచి డ్వామా అధికారులకు శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ, శిక్షణ కేంద్రం(ఈటీసీ)లో ఈ నెల 9వ తేదీ నుంచి తొమ్మిది జిల్లాల డ్వామా అధికారులకు శిక్షణ ఇవ్వనున్నామని సీనియర్ ఫ్యాకల్టీ ఎంఎస్ఎస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన డ్వామా 31 మంది ఏపీడీలు, 173 మంది ఏపీఓలు, 148 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తామని వివరించారు. ఈ నెల 18 వరకూ శిక్షణ జరుగుతుందన్నారు.

• జనసంద్రమైన తాళ్లూరు



పుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు జియ్యన్న మఠం గోవింద నామస్మరణతో మార్మోగింది. తాళ్లూరు మఠంలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం వేకువజాము నుంచి ఆలయ ప్రాంగణంలోని గజేంద్ర మోక్ష పుష్కరిణిలో వేలాదిగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. పితృదేవతలకు సాలగ్రామ దానాలు చేసి, తర్పణాలు వదిలారు. గ్రామంలోని దారులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పలు ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.



తాళ్లూరులో స్వామి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

వేలాదిగా.. సత్యదేవుని సన్నిధికి

అన్నవరం: రత్నగిరికి ఏకాదశి సందర్భంగా శుక్రవారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. సత్యదేవుని ఆలయం, వ్రత, విశ్రాంతి మండపాలు, ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాన్ని తెల్లవారుజామున ఐదు గంటలకే తెరిచి, వ్రతాల నిర్వహణ, స్వామివారి దర్శనాలు ప్రారంభించారు. సాయంత్రం వరకూ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రత్యేక దర్శనానికి గంట, సాధారణ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి, పూజలు చేశారని అధికారులు తెలిపారు. వ్రతాలు 2 వేలు నిర్వహించారు. రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. ఏకాదశి తిథిని పురస్కరించుకుని సత్యదేవుడు, అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవారికి ఉదయం 7 గంటలకు 108 స్వర్ణ పుష్పాలతో అర్చన, ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ లక్ష తులసి దళార్చన నిర్వహించారు.

అరకొరగా ప్రసాదాల పంపిణీ

వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ ఒక ప్రహసనంలా మారింది. సాధారణ రోజుల్లో భక్తులకు ప్రసాదాలు మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పంచిపెడుతూంటే పర్వదినాల్లో ఉదయం 11 గంటలకే అయిపోతున్నాయి. శుక్రవారం ఇలాగే జరిగింది. స్వామి వారిని దర్శించిన భక్తులకు ఆలయ ప్రాంగణంలోకి వచ్చే మెట్ల మార్గంలో అర్చక స్వాములు తీర్థం, చక్కెర పొంగలి, పులిహోర పంపిణీ చేస్తూంటారు. ఉదయం ఎనిమిది గంటలకు ప్రసాదాల పంపిణీ మొదలవుతుంది. మధ్యాహ్నం ఒంటిగంట వరకూ పంపిణీ చేస్తూంటారు. శని, ఆదివారాలు, దశమి, ఏకాదశి వంటి పర్వదినాల్లో ఉదయం 11 గంటలకే ప్రసాదాల పంపిణీ అయిపోతోంది. 25 కేజీలతో తయారు చేసిన పులిహోర, చక్కెర పొంగలి భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న రోజుల్లో త్వరగా అయిపోతుండటంతో మిగిలిన వారికి తీర్థం ఇస్తున్నామని అర్చకులు చెబుతున్నారు. వాస్తవానికి రద్దీ ఎక్కువ ఉన్న రోజుల్లో భక్తులు సాయంత్రం వరకూ వస్తూనే ఉంటారు. కనీసం మధ్యాహ్నం రెండు గంటల వరకూ అయినా ప్రసాదాల పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిలుచున్న భక్తులు

నవ సంక్షేమం

- కుటుంబ మ్యాపింగ్‌లో సవరణకు అవకాశం
- సచివాలయాల్లోనే మార్పులు, చేర్పులు

కాకినాడ సిటీ: సంక్షేమ పథకాల అమలులో కీలకమైన కుటుంబ మ్యాపింగ్(హౌస్ హోల్డ్ మ్యాపింగ్)లో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. కుమారుడు, కుమార్తె వివాహమై వేరుగా ఉంటున్నా, తల్లిదండ్రులతో పాటు ఒకే కుటుంబంగా భావిస్తూనే ఇప్పటి వరకూ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. అరంచెల విచారణలో భాగంగా కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరి పేరున ఆస్తులు, వాహనాలుండటంతో కొందరు అనర్హులయ్యేవారు. అలాంటి వారందరికీ ఊరటనిచ్చేలా సవరణలకు అవకాశం కల్పిస్తూ సచివాలయాలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

2019లో సర్వే

గతంలో ప్రజా సాధికార సర్వే పేరుతో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేశారు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో నవశకం సర్వే చేసి, కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. సంక్షేమ పథకాల అమలులో కుటుంబ మ్యాపింగ్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం పాటిస్తోంది. దీని ఆధారంగానే పింఛన్, వైఎస్సార్ చేయూత, జగనన్న విద్యా, వసతి దీవెన, ఆసరా, అమ్మ ఒడి, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ, వాహన మిత్ర, నేతన్న నేస్తం వంటి సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేస్తోంది. కుమారుడు, కుమార్తెలకు పెళ్లిళ్లయి వేర్వేరుగా ఉంటూ రేషన్ కార్డులు విడివిడిగా ఉన్నా, వారందరూ ఒకే ఇంట్లో నివాసం ఉండటంతో ఒకే కుటుంబంగా మ్యాపింగ్ చేశారు. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న కుటుంబ సభ్యులనూ ఆయా కుటుంబాల్లోనే కలిపారు. ఆ తర్వాత మార్పులు, చేర్పులకు అవకాశం ఇవ్వకపోవడంతో సమస్యలు వస్తున్నాయి. కుటుంబ సభ్యుల పేరుతో నాలుగు చక్రాల వాహనం ఉండటం, ఆదాయపు పన్ను చెల్లింపు, ఇంటి స్థలం ఎక్కువ ఉండటం, విద్యుత్ బిల్లు అధికంగా రావడం వంటి కారణాలతో సంక్షేమ పథకాలకు కొంతమంది అనర్హులవుతున్నారు. కొత్తగా ఉద్యోగాలు పొందిన సచివాలయ ఉద్యోగుల తల్లిదండ్రులకూ ఇటువంటి సమస్యలు వచ్చాయి. ఈ క్రమంలో మ్యాపింగ్‌లో సవరణల కోసం ఎంతో మంది ఎదురు చూస్తున్నారు.

చాలా మందికి ప్రయోజనం

జిల్లాలో సచివాలయ ఉద్యోగులు అధిక శాతం వివాహాలై వేరుగా ఉంటున్నా.. వారి తల్లిదండ్రులకు, సోదరులకు పథకాలు నిలిచిపోయాయి. కుమార్తెకు పెళ్లయి అత్తవారింటికి వెళ్లినా ఇటువంటి పరిస్థితే. అలాంటి వారికి ప్రస్తుతం భర్త కుటుంబంలో మ్యాపింగ్ చేయించుకునే అవకాశంతో పాటు తల్లిదండ్రుల కుటుంబం నుంచి బయటకు వచ్చే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. భార్యాభర్తలను ఒక జంటగా, తల్లిదండ్రులను మరో జంటగా పరిగణిస్తారు. విడాకులు తీసుకున్న వారిని వేరుగా పరిగణిస్తారు. వితంతువులు, భార్యను కోల్పోయిన వారు, ఒంటరిగా ఉంటున్న వారికి రేషన్ కార్డులు ఇస్తారు. చనిపోయిన వారి పేర్లు తొలగించడంతో పాటు కొత్తగా పెళ్లయిన వారిని జంటగా పరిగణించి కొత్త రేషన్ కార్డు ఇస్తారు. పెళ్లయిన ఆడపిల్లలను భర్త కుటుంబంలో చేర్చుతారు. ప్రస్తుత సవరణల వల్ల కాకినాడ జిల్లా వ్యాప్తంగా సుమారు 35 వేలకు పైగా కుటుంబాలకు మేలు జరగనుంది.


ధ్రువీకరణ పత్రాలు చూపాలి

నవశకం సర్వే డేటాలోని కుటుంబ సభ్యుల వివరాల్లో మార్పులు, చేర్పులు చేసుకోదలచిన వారు సచివాలయాలను సంప్రదించాలి. ఏదో ఒక ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుంది. పెళ్లయిన వారు మ్యారేజ్ సర్టిఫికెట్ చూపించాలి. ఆధార్, బియ్యం, ఆరోగ్యశ్రీ కార్డులు సమర్పించాల్సి ఉంటుంది. అలాగే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కూడా ఇవ్వాలి.



వైఎస్సార్ నవశకం లోగో

అర్హులందరికీ సంక్షేమం అందించేందుకే..



నవశకం డేటాలో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. భార్యాభర్తలను జంటగా పరిగణించి విభజిస్తారు. తప్పనిసరిగా వేరు కాపురం ఉండాలి. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

– ఎస్.ఇలక్కియ, జాయింట్ కలెక్టర్, కాకినాడ జిల్లా

సమస్యల పరిష్కారానికి 9 నుంచి ఉద్యమం

కాకినాడ సిటీ: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 9వ తేదీ నుంచి ఉద్యమానికి సిద్ధమవుతున్నామని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర నాయకులు ప్రకటించారు. స్థానిక రెవెన్యూ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక తదితర వర్గాల సమస్యల పరిష్కారానికి ఈ ఉద్యమం చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అధ్యక్షుడు, ఏపీ ఏజేసీ అమరావతి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కృష్ణమోహన్, డీజే ప్రసాదరావు, జిల్లా చైర్మన్ పితాని త్రినాథరావు, రాష్ట్ర వీఆర్‌ఓల సంఘం అధ్యక్షుడు చంటి తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

కొయ్యూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు వెంటాడి పట్టుకున్నారు. సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం బీడిపాలెం శివారులో తనిఖీలు చేపట్టారు. చింతపల్లి నుంచి కాకరపాడు మీదుగా ఏలేశ్వరం వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు పోలీసులను చూడగానే వెనుతిరిగి పారిపోయేందుకు ప్రయత్నించారు. ఎస్సై రాజారావు వెంబడించి వారిని పట్టుకున్నారు. వారి నుంచి ఎనిమిది కిలోల గంజాయి, స్కూటీ, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. పట్టుబడిన వారిని కాకినాడకు చెందిన దార నాని, కాశీ దిలీప్‌కుమార్‌గా గుర్తించారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఆయన పేర్కొన్నారు.

కమనీయం.. నరసన్న కల్యాణం


అలరించిన శక్తి వేషాలు


స్వామి, అమ్మవార్ల కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న పండితులు


రథోత్సవాన్ని ప్రారంభించిన హోంమంత్రి వనిత. పక్కన కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే జక్కంపూడి తదితరులు


భక్తజన కోలాహలం మధ్య సాగిన నరసింహుని రథోత్సవం

- కోరుకొండకు పోటెత్తిన భక్తజనం
- రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన హోం మంత్రి వనిత
- పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే రాజా

మధురపూడి: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం శుక్రవారం కమనీయంగా సాగింది. రాత్రి 10.33 గంటలకు అమ్మవారికి అర్చకులు మంగళసూత్ర ధారణ చేయించారు. వైఖానస ఆగమం ప్రకారం స్వామివారి కల్యాణ క్రతువు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రభుత్వం తరఫున హోం మంత్రి తానేటి వనిత పట్టు వస్త్రాలను అందజేశారు. పండితులు పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు, దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ, ఎస్వీ రంగరాజ భట్టర్, అర్చక స్వాముల పర్యవేక్షణలో కల్యాణ వేడుక కమనీయంగా జరిగింది.

కొండెక్కడం మధురానుభూతి : హోంమంత్రి

కోరుకొండ ఎక్కడం మధురానుభూతి అని, అక్కడ కొలువుదీరిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకోవడం ఎంతో అదృష్టమని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత అన్నారు. రథోత్సవంలో పాల్గొన్న వనిత విలేకరులతో మాట్లాడుతూ స్వామివారిని 650 మెట్లు ఎక్కి దర్శించుకున్నానన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో ఉండేలా చూడాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు. కోరుకొండకు రోప్ వే ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భక్తులకు మరింతగా సౌకర్యాలు కల్పించడానికి చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. రుడా చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, అన్నవరం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు తాడి రజనీ రెడ్డి, ఏసీ రమేష్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అపశ్రుతి

స్వామివారి రథయాత్రలో అపశ్రుతి చోటు చేసుకుంది. రథం కొండవద్ద నుంచి దేవస్థానం రోడ్డు మీదుగా సాయినగర్‌కు చేరుకోగా కాపవరానికి చెందిన కాపవరపు నాగబాబు రథం కొబ్బరికాయలు లాగారు. ఆ సమయంలో ఆయన కాలు రథం చక్రం కింద నలిగిపోయింది. రాజానగరం మండలం దివాన్‌చెరువుకు చెందిన కూర్మదాసు శ్రీనివాసేకు కూడా స్వల్పగాయాలయ్యాయి. వీరిద్దరినీ రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఎమర్జెన్సీ విభాగంలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆయన సతీమణి రాజశ్రీ ఆస్పత్రికి వెళ్లి వారి పరిస్థితిపై ఆరా తీశారు.

కనుల పండువగా రథోత్సవం

కల్యాణోత్సవానికి విచ్చేసిన భక్తులతో ఉదయం నుంచే కోరుకొండలోని వీధులన్నీనిండిపోయాయి. భక్తులు సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం 1–56 గంటలకు అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు. గరగ నృత్యం, బ్యాండ్ మేళాలు, కోలాటం, టీన్‌మార్, శక్తి వేషధారణలు, కేరళ డ్రమ్స్ వాయిద్యాలతో, భక్తుల గోవిందనామ స్మరణతో రథయాత్ర వైభవంగా నిర్వహించారు. కొండ దగ్గర నుంచి ప్రారంభమైన రథోత్సవం రెడ్డి పంతులు సత్రం మీదుగా పాత సంతమార్కెట్, మత్స్యకారుల వాడ, ఎయిర్‌టెల్ టవర్, సాయిబాబా గుడి, అంకాలమ్మ గుడి, శివాలయం మీదుగా సాయంత్రం 6 గంటలకు దేవస్థానానికి చేరుకుంది. మేళతాళాలతో ఎదుర్కోలు నిర్వహించి నరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవార్లను ఆలయంలోకి తోడ్కొని వెళ్లారు.

మత్స్యకారుల వలలో భారీ కోణాలు


మత్స్యకారులకు చిక్కిన కోణం చేపలు

రూ.10 లక్షలకు పైగా వ్యాపారం

కొత్తపల్లి: అమీనాబాద్ శివారు చేపలరేవులో శుక్రవారం మత్స్యకారులకు చిక్కిన భారీ కోణాలు వారికి కాసుల పండించాయి. బోట్లపై వేటకు వెళ్లగా రూ.10లక్ష విలువ చేసే కోణం చేపలు వలలకు చిక్కాయి. ఈ చేపలను వ్యాపారులు తమిళనాడు, కేరళ, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో కోణాల చేపల వ్యాపారం భారీగా జరుగుతోందని మత్స్యకారులు తెలిపారు.

మండుటెండలో పరుగుల పరీక్ష

- సొమ్మసిల్లి పడిపోయిన 25 మంది విద్యార్థినులు
- సకాలంలో వైద్యం అందడంతో తప్పిన ప్రాణాపాయం
- ఖేలో ఇండియా అంటూ అధికారుల నిర్వాకం
- ఆగ్రహం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు


అస్వస్థతకు గురైన విద్యార్థికి పండ్లు అందిస్తున్న ఆర్డీఓ ముక్కంటి, డీఎంఅండ్‌హెచ్‌వో దుర్గారావుదొర


విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అంబాజీపేట: ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా రన్నింగ్‌లో పాల్గొన్న 10వ తరగతి విద్యార్థినులు ఎండధాటికి తాళలేక సొమ్మసిల్లి పడిపోవడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఉదయం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఖేలో ఇండియాలో భాగంగా ఆరు ఈవెంట్లలో పోటీలను నిర్వహించేందుకు పాఠశాల ప్లే గ్రౌండ్ చుట్టూ మూడు రౌండ్లు పరుగు పెట్టాలని విద్యార్థినులను పీఈటీ ఆదేశించారు. ఉదయం 11.30 గంటలకు మండుటెండలో పరుగు పెట్టడంతో 25 మంది విద్యార్థినులు సొమ్మసిల్లి పడిపోయారు. తీవ్ర అస్వస్థతకు గురైన వీరికి అధికారులు సకాలంలో వైద్య సేవలు అందించడంతో ప్రాణాపాయం తప్పింది. వీరిలో కొంత మందికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, ఆయాసం, వాంతులు వంటి లక్షణాలు రావడంతో హైస్కూలు ఎదురుగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మరికొంత మందిని హైస్కూల్‌లో ఉంచి వైద్యం చేశారు. ఎస్.నవ్యశ్రీ, ఎ.అభినయ, ఎం.లహరి, ఎ.తనూష శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది రావడంతో ఆక్సిజన్ ఏర్పాటు చేశారు. కె.అనితకు శ్వాసకోశ సమస్యతో పాటు నీరసంగా ఉండటంతో ప్రత్యేక వైద్య సేవలు అందించారు. వీరంతా కోలుకోవడంతో హెచ్‌ఎం బీర హనుమంతరావు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో తిరిగి పాఠశాలకు పంపించారు.

ఎవరు బాధ్యత వహిస్తారు?

మండుటెండలో విద్యార్థినులు గ్రౌండు చుట్టూ పరిగెడుతున్నా ఏ ఉపాధ్యాయుడు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడంపై విద్యార్థుల తల్లితండ్రులు విమర్శిస్తున్నారు. వారికి ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని హెచ్‌ఎం హనుమంతరావును ప్రశ్నించగా ఆ సమయంలో హైస్కూల్‌లో తాను లేను అని, ఈవెంట్ నిర్వహిస్తున్న విషయం తనకు తెలియదని చెప్పారు. పబ్లిక్ పరీక్షకు వెళ్లే పదవ తరగతి విద్యార్థులను శ్రద్ధగా చదివించకుండా ఇటువంటి క్రీడలు, ఈవెంటులు నిర్వహించడం ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

పునరావృతం కాకుండా చర్యలు : ఆర్డీవో

అంబాజీపేట హైస్కూల్‌లో జరిగిన ఘటన దురదృష్టకరమని, విద్యార్థులందరికీ ప్రాణాపాయం తప్పిందని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి అన్నారు. భవిష్యత్‌లో అకాల దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ జె.కనకదుర్గ, హెచ్‌ఎం హనుమంతరావుకు సూచించారు. అనంతరం అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించి, పండ్లను పంపిణీ చేశారు.

వైద్య సేవలు అభినందనీయం : డీఎంఅండ్‌హెచ్‌వో

అస్వస్థతకు గురైన విద్యార్థినులకు సకాలంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ వి.గౌతమి, సిబ్బంది ఆధ్వర్యంలో అందించిన సేవలు అభినందనీయమని డీఎంఅండ్‌హెచ్‌వో ఎం.దుర్గారావుదొర అన్నారు. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఇటువంటి పరీక్షలను నిర్వహించకూడదన్నారు. ఎండ తీవ్రత వల్ల బాలికలు స్పృహ కోల్పోయారన్నారు. ఈ విద్యార్థులు పూర్తి స్థాయి విశ్రాంతితో పాటు పోషకాహారం తీసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

పాఠశాలలను తనిఖీ చేసిన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్


కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి హైస్కూల్‌లో అధికారులకు ఆదేశాలు ఇస్తున్న ప్రవీణ్ ప్రకాష్

పెద్దాపురం: విద్యకు ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వానికి మచ్చ తెస్తున్నారు, ఉపాధ్యాయులు కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదంటూ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి హైస్కూల్‌లో శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ జరిపారు. ఆర్జేడీ నాగమణి, జిల్లా విద్యాశాఖాధికారి అన్నపూర్ణ, డీవైఈఓ సుబ్రహ్మణ్యంలతో ఆయన వెంట ఉన్నారు. ప్రవీణ్ ప్రకాష్ నేరుగా పాఠశాల గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. వాళ్లకు బోధించారు. ఆయన ప్రశ్నలకు విద్యార్థులు సమాధానం ఇవ్వలేకపోవడంతో క్లాస్ టీచర్, హెచ్‌ఎం, ఎంఈఓ, డీవైఈఓ, డీఈఓల తీరుపై మండిపడ్డారు. బోధనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆర్జేడీ నాగమణిని ఆదేశించారు. పాఠశాలలో ఉన్న ఆయాలు, మధ్యాహ్న భోజనం వడ్డించే కుక్‌లతో మాట్లాడుతూ మీ జీతం ఎంత అని ప్రశ్నించారు. రూ.ఆరు వేలు అంటూ ఆయా సమాధానం ఇవ్వగా జీతం సక్రమంగా అందుతోందా అని ప్రశ్నించారు. డిసెంబర్ వరకే జీతాలు ఇచ్చారని, రెండు నెలల బకాయిలు ఉన్నాయని చెప్పడంతో ఎందుకు జీతాలు ఇవ్వలేదని సంబంధిత అధికారిని ప్రశ్నించారు. సీఎఫ్ఎంఎస్ కారణంగా జీతాలు ఆలస్యం అయ్యాయని సమాధానం రావడంతో సిబ్బందిపై మండిపడ్డారు. నాకు ప్రతీ నెలా సక్రమంగా అందుతున్నప్పుడు కింది సిబ్బందికి ఎందుకు ఇవ్వలేకపోతున్నారు.? వచ్చే నెల నుంచి ఆయాలకు, కుక్‌లకు జీతాలు ఇచ్చిన తరువాతే ఎవరికైనా జీతాలు మంజూరు కావాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.180 కోట్లు జీతాలుగా ప్రభుత్వం ఇస్తుంటే కొంతమంది జీతాలు తీసుకుని న్యాయం చేయకపోవడం తగదన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను సక్రమంగా వాడుతున్నదీ లేనిదీ పరిశీలించారు.

ముకుందవరంలోనూ ఆకస్మిక తనిఖీ

రంగంపేట: మండలంలోని ముకుందవరం జెడ్పీ హైస్కూల్‌ను ప్రవీణ్‌ప్రకాష్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఒక తరగతి గదిలో కొంతమంది విద్యార్థులు బెంచిపై కాకుండా కింద కూర్చోవడం, ఇంగ్లిషు టీచర్ వేరే సబ్జెక్ట్ బోధించడం, పీడీ లెక్కలు చెప్పడం వంటి విషయాలను ఆయన గుర్తించారు. ఉపాధ్యాయులపై అసహనం వ్యక్తం చేశారు. ఇక నుంచి విద్యార్థులు బెంచీలపైనే కూర్చోవాలని, ఉపాధ్యాయులు ఎవరి సబ్జెక్టులు వారే బోధించాలని సూచించారు. మనబడి నాడు–నేడు పథకంలో పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్ది కార్పొరేట్ స్థాయిలో విద్యనందిస్తున్నట్టు చెప్పారు. బోధన కూడా అదేవిధంగా ఉండాలన్నారు. డీఈఓ ఎస్.అబ్రహం, డీవైఈఓ తిరుమలదాసు, ఎంఈఓ కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు. సామర్లకోట, మండపేట, గోకవరం తదితర ప్రాంతాల్లో కూడా పాఠశాలలను ప్రవీణ్ ప్రకాష్ తనిఖీ చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి జవాబులు తెలుసుకున్నారు.

క్రైం కార్నర్..

మనస్తాపంతో ఆత్మహత్య


నాగదేవి మృతదేహం

సీతానగరం: అమ్మమ్మ వద్ద ఉంటూ ఒంటరితనం భరించలేక మనస్తాపంతో బొబ్బిల్లంకలో సబ్బవరపు నాగదేవి (19) ఉరి వేసుకుని ఆత్మహత్యకు చేసుకుంది. ఎస్సై కె.శుభశేఖర్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బొబ్బిల్లంకకు చెందిన సబ్బవరపు నాగదేవి తల్లిదండ్రులు పదేళ్ల క్రితం విడిపోయారు. తల్లి నాగరత్న ఏడాది క్రితం రెండవ వివాహం చేసుకుని ఖమ్మం వెళ్లింది. తండ్రి సత్తిబాబు జగ్గంపేటలో ఉంటున్నాడు. అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్న నాగదేవి పదవ తరగతి చదివి ఇంటివద్ద ఉంటోంది. తాత కట్టోజు రాముడు, అమ్మమ్మ పొలం పనులకు వెళ్లిన తరువాత ఉదయం 10 గంటలకు ఇంటి దూలానికి తన చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న ఎస్సై శుభశేఖర్ మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాత రాముడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బంగారు ఆభరణాల చోరీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని అదివారపుపేటకు చెందిన కొండా వీరదుర్గకు చెందిన ఏడు కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురి కావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. వీరదుర్గ గత ఏడాది డిసెంబరు 24న హైదరాబాద్ నుంచి ఒక ఫంక్షన్‌కు అదివారపుపేటకు వచ్చారు. తన హేండ్‌బ్యాగు హేంగర్‌కు తగిలించారు. సాయంత్రం హేండ్ బ్యాగులో ఉంచిన ఏడు కాసుల బంగారు హారం, చెవిదిద్దులు చోరీకి గురైనట్లు గుర్తించారు. హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం వరకు రైలులో రావడంతో ట్రైన్‌లోనే దొంగతనం జరిగిందని అనుమానించి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే రైల్వే పోలీసుల నుంచి వచ్చిన రిపోర్టు ఆధారంగా గురువారం కేసు రిజిస్ట్రేషన్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో మూడు నెలల జైలు

మండపేట: పట్టణంలో రెండు చోరీ కేసుల్లో ముద్దాయికి మూడు నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ శుక్రవారం ఆలమూరు జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ డాక్టర్ కె.దీపదైవకృప తీర్పునిచ్చారు. పట్టణ ఎస్‌ఐ ఎం.అశోక్ తెలిపిన వివరాల మేరకు గత ఏడాది పట్టణంలోని గాంధీనగర్‌లో మోటారు సైకిల్, విజయలక్ష్మినగర్‌లోని జిమ్‌లో టీవీ చోరీ కాగా బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేశారు. దర్యాప్తులో రాయుడు దుర్గారావును అరెస్టుచేసి అతని వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువుకావడంతో దుర్గారావుకు శిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారని ఎస్‌ఐ అశోక్ తెలిపారు. ఏపీపీగా విల్లా శ్రీరాములు కేసును వాదించారన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

పిఠాపురం: ఆశా వర్కర్ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసి ఒక మహిళా నిరుద్యోగి నుంచి రూ.60,500 కాజేసిన నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసినట్లు పిఠాపురం రూరల్ ఎస్సై ఎండీ అబ్దుల్‌నబీ తెలిపారు. ఆయన కథనం ప్రకారం పిఠాపురం మండలం విరవకు చెందిన ఎస్.గిరీష కాకినాడ కలెక్టరేట్‌లో 20 డిసెంబర్ 2022న ఆశా వర్కర్ జాబుకు దరఖాస్తు చేసుకుంది. వారం రోజుల తరువాత ఒక అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి తాను కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పని చేస్తుంటానని ఆశా వర్కర్ పోస్టు ఇవ్వడానికి అంతా సిద్ధమైందని, అయితే కొంత సొమ్ము ముట్టజెప్పాలని నమ్మబలికాడు. దీంతో అతని మాటలు నమ్మిన ఆమె రూ.45,000 నెట్ బ్యాంకింగ్ ద్వారా, రూ.15, 500 ఫోన్‌పే ద్వారా అతనికి పంపింది. అయితే ఎన్నాళ్లయినా జాబు రాకపోగా ఆ వ్యక్తి ఫోన్ తియ్యకపోవడంతో తాను మోసపోయానని గ్రహించింది. ఈ ఏడాది జనవరి 23న పిఠాపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఫోన్ నంబరు ఆధారంగా దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడు విజయనగరం జిల్లాకు చెందిన డి.రవికుమార్‌గా గుర్తించారు. అతను గతంలో కొత్తపల్లి మండలం నాగులాపల్లిలో ఉంటు పొన్నాడలో రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రంలో పని చేసేవాడు. ప్రస్తుతం విశాఖ జిల్లా పరవాడలో ఒక ఫార్మా కంపెనీలో సెక్యూరిటీ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. అతనిని శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు ఆయన తెలిపారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


దుర్గామహాలక్ష్మి

జగ్గంపేట: జాతీయ స్థాయిలో త్వరలో జరిగే కబడ్డీ పోటీలకు జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.వెంకట దుర్గా మహాలక్ష్మి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు బి.మురళీకుమార్, శివ, తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గత నెల 28 నుంచి ఈ నెల 2వ తేదీ వరకూ చిత్తూరు జిల్లా నగరి గ్రామంలో అండర్ 14 బాలికల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు జరిగినట్లు తెలిపారు. ఈ పోటీలలో జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎం.వెంకట దుర్గా మహాలక్ష్మి, కె.వాణీ అమూల్య పాల్గొన్నారని తెలిపారు. వీరిలో దుర్గా మహాలక్ష్మి మంచి ప్రతిభ కనబరచడంతో ఆంధ్రా జట్టు తరఫున జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని వివరించారు.